# అనగనగా... ఒక కథ

# కాలయంత్రం

ప్రశాంతతో, పవిత్రతతో, కార్యదీక్షాపరులైన శాంతి యోధులు క్రమశిక్షణా బద్ధులవటానికి కొలువైన ఆలయమది.

శాంతి అహింసలు కరచరణాలై పోరాడి విజృంభించే సత్యాగ్రహుల తాలింఖానా అది.

సత్యాగ్రహం అంటే..అన్నం మానటం అనే కాదు- నిజమైన కోపం- అవసరమైన నిరసన అన్న అర్థాన్ని అవగతం చేసుకునే విద్యాలయమది.

చెప్పినదే చేయటమూ-చేసేదే చెప్పడమూ అనే మాట రూపుకట్టిన గాంధీమహాత్ముడు కొలువున్న సబర్మతీ ఆశ్రమమది.

1930 ప్రాంతంలో..

ఓరోజు..

మహాత్మాగాంధీ ఎవరెవరికో సందేశాలు ఇస్తూ సంశయాలు తీరుస్తూ కొన్ని కార్డులు రాసి, పోస్టు చేయమని కోటా పురుషోత్తమరావుకి ఇచ్చారు-పురుషోత్తమరావు బైల్దేరుతుండగా గాంధీ వెనక్కు పిల్చారు.

"ఇదిగో..పురుషోత్తం ఈ గడియారం రిపేరుకివ్వాలయ్యా- ఇందాకా ఏదో ఆవేశంలో ఆలోచనలో..'కీ' ఎక్కువసేపు తిప్పాను- లోపలేదో స్ప్రింగు పుటుక్కుమన్నట్లుంది- త్వరగా బాగు చేసి ఇవ్వమను- కాలయంత్రం లేకపోతే మనని మనం నియంత్రించుకోలేం కదా" అన్నారు కాలం విలువ తెల్సిన మహాత్ముడు.

పురుషోత్తమరావుగారు ఒక్కక్షణం తటపటాయించి...

"బాపూజీ..మీరేమీ అనుకోకపోతే నా జేబు గడియారాన్ని వాడుకోండి. నేనీలోగా ఇది బాగు చేయిస్తాను" అని తన జేబు గడియారాన్ని ఇచ్చాడు.

"ఓ..ఇదీ బాగానే వుంది- నాదీ ఇలాంటిదే కదా ఇంకేం- నువ్వు అది బాగుచేయించుకుని-రిపేరుకెంత సొమ్మయిందో అడిగి తీసుకో"

తలూపి బైల్దేరాడు పురుషోత్తమరావు.

ఆయన దగ్గర రిపేరు ఖర్చు తీసుకోవడానికి మొహమాటపడ్డాడో..తన దగ్గర ఆ డబ్బులేక రిపేరుకి ఇవ్వలేదో పురుషోత్తమరావు ఆ గడియారాన్ని బాగు చేయించలేదు. ఎంతో ఆప్యాయతగా దాచుకున్నాడు.

అది బాపూజీ గడియారం. తనకు పరమ పవిత్రం. ఆ తర్వాత పురుషోత్తమరావు అందరు కార్యకర్తల్లాగే వాళ్ల వాళ్ల ప్రాంతాల్లో స్వదేశీ ఉద్యమం విస్తృత పరచడానికి వెళ్లారు.

పురుషోత్తమరావు తన స్వస్థలం కోస్తాతీరం వచ్చేశాడు.

* * *

కోస్తాతీరంలో ఆత్రేయపురం కేంద్రంగా అప్పటి తాలూకాలన్నీ కలతిరుగుతూ స్వదేశీ ఉద్యమాన్ని ప్రచారం చేస్తూ ప్రాంతీయ బ్రిటీష్ పాలకులకి వీలైనంత చిక్కులూ చికాకులూ కలిగించాడు..సత్యాగ్రహి పురుషోత్తమరావు.

కొన్నేళ్లు గడిచాయి. స్వాతంత్ర్యోద్యమానికి కొత్తరూపూ ఊపూ వచ్చింది.

ఏతావాతా రెండు మూడుసార్లు జైలుకెళ్లి ఓ రోజు జైల్లోనే అనారోగ్యంతో మరణించాడు పురుషోత్తమరావు.

పురుషోత్తమరావు కొడుకు..మోహన్‌దాసు తండ్రి భౌతిక కాయాన్నీ, ఆయన తాలూకు చేతి సంచిని తెచ్చాడు. తండ్రి కుటుంబాన్ని పట్టించుకోకుండా తిరగటం అతనికేమాత్రం ఇష్టం వుండేది కాదు.

"పాడైపోయిన ఓ జేబు గడియారం, మురికిపట్టిన ముతక ఖద్దరు ఒక జత, బట్టలూ ఆయన మిగిల్చిన ఆస్తులు"

ఈసడింపుగా అనుకున్నాడు-

కానీ తల్లి కామాక్షి మాత్రం ఆ చేతి సంచిని అక్కున జేర్చుకుని వెక్కి వెక్కి ఏడిచింది. తన చీరల పెట్టిలో ఈ సంచీని పెట్టుకుని రోజుకోసారి కన్నీళ్లు పెట్టుకునేది.

గడియారం చూసినప్పుడు "పోనీ..బాగు చేయించరా యిదీ" అని కొడుకుని అడుగుదాం అనుకునేది గానీ..తండ్రి మాటెత్తితేనే మండిపడతాడే..పోయిన మారాజుని తిట్టించటం దేనికని గొంతు గుండెలో నొక్కేసుకునేది-

కొన్నాళ్లకి ఆవిడ ఫోటో కూడా మొగుడి ఫోటో పక్కకి చేరింది. ఆవిడ పెట్టి అవతలకెళ్లాలా..కొన్నాళ్లగాలో తెలీక- అటకెక్కింది.

* * *

ఈ కథ జరిగి చాలా ఏళ్లయింది. మోహనదాసు కొడుకు ఉత్తమ్..ఇంటర్ పరీక్షలు రాసి ఇంటిపట్టున ఉంటున్నాడు. ఈమధ్యలో ఎంసెట్ కూడా రాశాడు. మంచి రేంకు కాదు గానీ మధ్య రేంకులోనే వున్నాడు. ఏ ప్రైవేట్ కాలేజీ వాడైనా ఇంజనీరింగ్‌లో సీటిస్తాడు. కానీ డొనేషన్ కట్టాలి. మోహనదాసుకి అంత స్తోమత లేదు. కొడుకు పోరు పడలేక..కాదు తనలాగే వాడూ జీవితాంతం తండ్రిని తిట్టుకుంటాడని అనుకున్నాక..అక్కడా అక్కడా అప్పులు కోసం కలయ తిరుగుతున్నాడు.

"నీకు బుర్రలేదు గురూ..మీ నాన్న స్వాతంత్ర్య పోరాటం చేశాడు. ఎన్ని బెనిఫిట్స్ ఎంత రివార్డులూ వచ్చేవో" అంటూ ఫ్రెండ్స్ అన్నారు.

"నిజమే కావచ్చు. ఆయనగారు ఏ ప్రూఫ్‌లూ మిగల్చలేదు. మిగిలిస్తే..మేం దాన్ని స్వార్థానికి వాడుకుంటే ఆయనగారి నిస్వార్థ దేశభక్తి డైల్యూట్ అయిపోతుందని కాబోలు. మామూలు నేరస్తుల్లా పోయాడు" తండ్రి మీద అక్కసు వెళ్లగక్కాడు.

"ఇది ఆయన తప్పుకాదు. నీ అప్రయోజకత్వం" అనేవాళ్లు ఫ్రెండ్స్.

వినగా వినగా మోహనదాసుక్కూడా తను తప్పు చేశానని అనిపించడం మొదలెట్టింది.

ఓరోజు పొద్దున్న అటకెక్కిన పనికిరాని వస్తువుల్లో ఉన్న అమ్మానాన్నల కామన్ పెట్టెని కిందికి దింపాడు. నాన్న గురించి చెప్పడానికి ఏదైనా ఆధారం దొరుకుతుందేమోనని!!

చెదలో..ఎలకలో..తినేసిన బట్టల్లో, కాయితాల్లో..చెక్కు చెదరనిది ఆ జేబు గడియారం ఒక్కటే- వాటికా గడియారం కొరకబడక వొదిలేసాయేమో-

గడియారాన్ని ఎగాదిగా చూశాక పైకప్పు వెండిదేమో అనిపించింది మోహన్‌దాస్‌కి.

ఎంతోకొంత సొమ్ము రాకపోదుగా అనుకుని వెండి దుకాణానికి వెళ్లాడు-

దుకాణంలో అది వెండి కాదని వట్టి స్టీలేననీ తేలింది.

"పదోపరకో ఇచ్చి బాగుచేయించండి సార్. పాత మోడలంటే పడిచచ్చే వెర్రాళ్లు కొనుక్కుంటారూ" అని సలహా ఇచ్చాడు దుకాణదారు.

మోహన్‌దాస్ తండ్రిని ఇంకోసారి తిట్టుకుని..విరక్తిగా నవ్వుకున్నాడు.

ఎదురు షాపు గడియారాల షాపే..


ఎందుకో 'అటెళ్తే..' అనిపించింది.

"అయ్యనాయనో- ఇలాంటి ఓల్డ్ మోడల్ మనవల్ల రిపేరీ కుదరదండి..మా నాన్నకి చూపిస్తా రేపు రండి..ఆయన పన్చేస్తుందంటే ట్రై చేద్దాం" అన్నాడు వాచీలషాపు ఆయన.

"మీ నాన్న కూడా ఇదే పనా.."

"అవునండి..ఇదాయన షాపే. పెద్దాడైపోయాడు. ఇంటిపట్టునే వుంటున్నాడు. నాకీ పని నేర్పింది తనేనండి"

"మానాన్న ఇలాంటి పని నేర్చుకుని నాకు చెప్పినా బావుండేది స్వాతంత్ర్యోద్యమం అని ఊళ్లు పట్టుకు తిరిగి నా బతుకు వీధిన పడేశాడు" ఇంకోసారి తండ్రిని తిట్టుకుని "సరే రేపొస్తాను..రిపేరు అవుతుందేమో చూడు" అనేసి వెళ్లిపోయాడు మోహన్‌దాస్.



★ ★ ★

"ఇది మామూలు గడియారం కాదు బాబూ! ఇలాంటి మోడల్ చాలా విలువైంది. ఈ కంపెనీ ఇలాంటివి తక్కువ చేసింది. పంతొమ్మిది వందల ఒకట్లో చేశారు. మళ్లీ మానేశారు. ఇది నీకెలా దొరికింది. దీన్నివాళ మార్కెట్లో పెడితే..రెండు లక్షలు వస్తుంది తెల్సా?"

ముసలాయన నిజాయితీగా చెప్పాడు.

మోహనదాసుకి ముచ్చెమట్లు పోశాయి.

"దీన్ని నేను కొనుక్కుంటాను..నీకు రెండు లక్షలు ఇస్తాను-ఇస్తావా" అన్నాడాయన.

మోహనదాసుకి ఆనందంతో వళ్లు గగుర్పొడిచింది.

"నేను దీన్ని బాగు చేసి ఎంతకో కొంతకి అమ్ముకుంటాను. నీకు అభ్యంతరం లేకపోతేనే"

మోహన్‌దాసుకు కన్నీళ్లు తిరిగాయి. నాన్న మీద గౌరవం కలిగింది.

"ఇస్తాను సార్- మీరు దీని విలువ చెప్పాక వద్దనలేను- నిజానికి దీన్ని ఇంకా ఎక్కువకి అమ్ముకోవచ్చేమో కానీ నాకా అమ్మకాలూ తెలియవు..కొనేవాళ్లూ తెలియదు"

★ ★ ★

ఉత్తమ్ ఇంజనీరింగ్‌లో జాయినయ్యాడు.

మోహన్‌దాను తండ్రిని తల్చుకుంటూ పుత్రోత్సాహంతో పొంగిపోతున్నాడు. తాతే నిన్ను చదివిస్తున్నాడ్రా అని పదే పదే అనుకుంటున్నాడు కన్నీళ్లతో.

★

★ ★

గడియారం రిపేరు చేసే ముసలాయనకి అది గాంధీ వాడిన గడియారం అని తెల్సు గనక రెండు లక్షల పైనే బేరం చేసి అమ్మేసుకున్నాడు.

ఇప్పుడా గడియారం ఎక్కడుందో తెలీదుగానీ...ఓపెన్ చేస్తే లోపల మూతలో 'గాంధీజీకి భక్తితో' అని వుంటుంది. అది కొనుక్కున్నవాడికే తెలుసు..అమ్మిన ముసలాయనకే తెల్సు.

★(ఇదేమాత్రం చరిత్ర కాదని, కల్పితమనీ పాఠకులు గమనించగలరు

-రచయిత)

★